క్లుప్తంగా

మరోసారి ఆర్‌జీఐఏకు 'ఎనర్జీ లీడర్‌' అవార్డు

శంషాబాద్‌: రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోసారి రెండు పురస్కారాలు పొందింది. 2025 నేషనల్‌ ఎనర్జీ లీడర్‌, ఎక్సలెంట్‌ ఎనర్జీ ఎఫీషియంట్‌ యూనిట్‌ పురస్కారాలను తిరిగి చేజిక్కించుకుంది. నేషనల్‌ ఎనర్జీ లీడర్‌ పురస్కారాన్ని వరసగా ఎనిమిదోసారి, ఎక్సలెంట్‌ ఎఫీషియంట్‌ పురస్కారాన్ని తొమ్మిదోసారి దక్కించుకుంది. ఇండియన్‌ ఇండస్ట్రీ ఫెడరేషన్‌ (సీఐఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎక్సలెన్స్‌ ఎనర్జీ మేనేజ్‌మెంట్‌ 26 జాతీయ అవార్డు కార్యక్రమంలో వీటిని అందుకున్నట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. పర్యావరణ హితమైన చర్యల్లో ఆర్‌జీఐఏ తొలి నుంచి నిబద్ధతతో పనిచేస్తోందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్‌ ఫణికర్‌ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం


మూర్తి

మణికొండ: మెడికల్‌ షాపునకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన మణికొండ మున్సిపాలిటీ పరిధిలో బీరప్ప దేవాలయం సమీపంలో జరిగింది. అతని కుమారుడు కె. భరత్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. తన తండ్రి కుర్‌కుంట్ల మూర్తి(52)కి కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేదు. మంగళవారం భాగ్యలక్ష్మి కాలనీలోని ఇంటి నుంచి బీరప్ప దేవాలయం సమీపంలో ఉన్న శ్రీసాయి మెడికల్‌ షాపుకు వెళ్లి వస్తానని వెళ్లారు. ఎంతకూ తిరిగి రాకపోవటం, పలు చోట్ల వెతికినా ప్రయోజనం లేక పోవటంతో రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మూర్తి ఆచూకీ తెలిసిన వారు ఫోన్‌: 95501 71816లో సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉత్సాహంగా జూనియర్‌ కళాశాల ఫ్రెషర్స్‌ డే


ఫ్రెషర్స్‌ డేలో సందడి చేస్తున్న విద్యార్థులు

శంషాబాద్‌: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఫ్రెషర్స్‌ డే బుధవారం ఉత్సాహంగా జరిగింది. కొత్త విద్యార్థులకు సీనియర్‌ విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆటపాటలతో అలరించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ఉండాలని ప్రిన్సిపాల్‌ మాధవరెడ్డి సూచించారు. కొత్త విద్యార్థులకు సీనియర్‌ విద్యార్థులు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబురాలు


బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు

ఏజీవర్సిటీ: శ్రీకొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బుధవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం సిబ్బంది, విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను తయారు చేసి ఆటపాటలు దాండియా ఆడుతూ ఉత్సాహంగా ఊరేగించారు.

ఉత్తమ రైతుకు సన్మానం


రైతు శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

శంషాబాద్‌ రూరల్‌: లయన్స్‌ ఇంటర్నేషనల్‌ డిస్ట్రిక్ట్‌ 320 ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ రైతుల సన్మాన కార్యక్రమంలో మండలంలోని బుర్జుగడ్డతండాకు చెందిన రైతు అబ్బూరి శ్రీనివాస్‌రావును ఘనంగా సన్మానించారు. బోధన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేశారు.

పొదుపు సభ్యులకు బోనస్‌

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ పరిధిలోని పార్థసారథి పొదుపు సంఘం సభ్యుల సమావేశాన్ని బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా దసరా బోనస్‌ను సభ్యులకు అందజేశారు. మొత్తం రూ. 17 లక్షల బోనస్‌ను సభ్యులందరికీ పంపిణీ చేశారు. సంఘం స్థాపించి 37 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యులంతా ఐక్యంగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. సంఘంలో రూ. 11 కోట్లమేర టర్నోవర్‌ ఉందని వెల్లడించారు.

రోడ్డు మూసివేతతో ఎన్ని కష్టాలో?

రహదారి విస్తరణ కోసం బంద్‌
- వాహనదారులు, స్థానికులకు తప్పని ఇబ్బందులు
- బ్లాస్టింగ్‌ సమయాల్లో మాత్రమే మూసేస్తే సరిపోతుందనే వాదనలు
- వ్యాపారాలు లేక ప్రశ్నార్థకంగా స్థానికుల ఉపాధి


మట్టిదిబ్బలు, బండరాళ్లతో మూసివేసిన రోడ్డు

శంషాబాద్‌: నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే కొత్వాల్‌గూడ–హిమాయత్‌సాగర్‌ రహదారి మూసివేయడంతో ప్రయాణికులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరికి ప్రయాణభారం కాగా మరికొందరికి బతుకు భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్దేశించిన సమయాల్లో రహదానిని మూసి కొన్ని సమయాల్లోనైనా రాకపోకలకు అనుమతి ఇవ్వాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

ఎందుకోసం..?

కొత్వాల్‌గూడ అండర్‌పాస్‌ మసీదు నుంచి హిమాయత్‌సాగర్‌ బ్రిడ్జి వరకు ప్రస్తుతం ఉన్న రహదారిని హెచ్‌ఎండీఏ అధికారులు రూ. 30 కోట్ల నిధులతో 70 ఫీట్ల రహదారిగా విస్తరిస్తున్నారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీతోపాటు ఇదే రహదారిలో హెచ్‌ఎండీఏ చేపడుతున్న ఎకో పార్కు కూడా మరికొద్ది మాసాల్లో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని హెచ్‌ఎండీఏ ఇక్కడ రోడ్డు విస్తరణ పనులు పదిహేను రోజుల కిందట ప్రారంభించింది.

సమస్యలు ఇవీ...

రోడ్డు విస్తరణను ప్రయాణికులతో పాటు స్థానికులు సమర్థిస్తున్నా రహదారి విస్తరణ మొదలుపెట్టిన రోజు నుంచే రోడ్డును పూర్తిగా మూసివేశారు. హిమాయత్‌ సాగర్‌వైపు భారి కేడ్లు ఏర్పాటు చేయగా కొత్వాల్‌గూడ వైపు ఏకంగా భారీ మట్టి దిబ్బలు, బండరాళ్లు వేసి మూసేశారు. ప్రస్తుతం ఈ రహదారి విస్తరణకు ఓ వైపు చెరువు ఉండడంతో అధికంగా మరో వైపు విస్తరణ చేయాల్సి ఉంది. దీంతో అక్కడక్కడ ఉన్న కొన్ని బండరాళ్లను తొలగించాల్సి ఉంది. అయితే నిర్మాణానికి ఓ వైపు భారి కేడ్లు ఏర్పాటు చేసుకుని మిగతా భాగంలో రాకపోకలకు అనుమతి ఇవ్వాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు. లేదా బ్లాస్టింగ్‌ సమయాల్లో నిలిపివేసి మిగతా సమయాల్లో రాకపోకలకు అనుమతించాలంటున్నారు. లేదా రాత్రి సమయాల్లో పూర్తిగా నిలిపివేసి ఉదయం సమయంలో రోడ్డు తెరిస్తే ఉద్యోగాలు, వ్యాపారాలకు రాకపోకలు సాగించే వారికి వెసులుబాటు ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. కనీసం ద్విచక్ర వాహనాలు, కార్లకు అనుమతి ఇచ్చినా కొంత వెసులుబాటు ఉంటుందంటున్నారు.

మరికొన్ని నెలల పాటు...

ప్రస్తుతం జరుగుతున్న పనులు మరో నాలుగైదు నెలల పాటు జరిగే అవకాశముందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ బతుకుదెరువు కూడా పూర్తిగా పోతోందని రోడ్డు పక్కన వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సముచిత నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే సాగర్‌ జలాశయానికి ఆనుకుని నిర్మాణం చేసిన ఓ ఫంక్షన్‌ హాల్‌కు మాత్రం హిమాయత్‌సాగర్‌ కట్టవైపు నుంచి అధికారులు రాకపోకలకు అనుమతి ఇస్తున్నారు. సాధారణ ప్రజలను మాత్రం అడ్డుకోవడం గమనార్హం.


విస్తరణ పనులు చేపడుతున్న రహదారి

వ్యాపారాలు లేవు



పది రోజులుగా రోడ్డును పూర్తిగా మూసేశారు. దీంతో నా టిఫిన్‌ సెంటర్‌ అసలే నడవడం లేదు. మరో నాలుగైదు నెలలు ఇలాగే ఉంటుందంటున్నారు. బ్లాస్టింగ్‌ సమయాల్లో మినహాయిస్తే రోడ్డు రాకపోకలు సాగించే అధికారులు నిర్ణయం తీసుకోవాలి

– బాలాజీ, టిఫిన్‌ సెంటర్‌, కొత్వాల్‌గూడ సర్వీసు రోడ్డు

రాకపోకలకు చాలా ఇబ్బంది



రెండు కిలోమీటర్లలో వెళ్లే శంషాబాద్‌కు రాజేంద్రనగర్‌ మీదుగా వెళ్లాలంటే పది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. చిన్నచిన్న ఉద్యోగాలు, పనుల మీద వెళ్లే వారికి చాలా ఇబ్బందిగా ఉంది. నెలల తరబడి జరిగే పనులుకాబట్టి అధికారులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. పూర్తిగా మూసివేయం ఇబ్బందిగా ఉంది.

– అబ్దుల్‌ మజీద్‌

ప్రజా సంక్షేమానికి కేంద్రం పెద్దపీట

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీ కొండా, కార్పొరేటర్‌ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చేవెళ్ల పార్లమెంట్‌ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ తగ్గించడంతో బుధవారం కాటేదాన్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ పన్ను భారం తగ్గించడంతో సామాన్యులకు లబ్ధి చేకూరిందన్నారు. పాదయాత్ర చేస్తూ దుకాణాలకు వెళ్లి ప్రజలకు జీఎస్‌టీ తగ్గడంపై వివరించామని పేర్కొన్నారు. నరేంద్రమోదీ ధైర్యం చేసి మూడేళ్ల జీఎస్‌టీపై అధ్యయనం చేసి పేదలకు ధరలు అందుబాటులో ఉండేలా చేశారన్నారు. ఒకప్పుడు సెల్‌ఫోన్లు ఏసీలు, కార్లు, ఏవి కావాలన్నా ఇతర దేశాల నుంచి తెచ్చుకునే వాళ్లం మోదీ వచ్చిన తరువాత మన యువశక్తి మేధా సంపత్తులను వినియోగించుకోని మేకిన్‌ ఇండియా మేడ్‌ ఇన్‌ ఇండియా అని నినాదానికి పరిమితం కాకుండా ఇక్కడే అన్ని వస్తువులు తయారు చేసేలా మార్చారన్నారు. 11 ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్‌ నాలుగో ఆర్థిక వ్యవస్థగా ప్రగతి సాధించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. ఇది మూడో ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని మోదీ కలలు కంటున్నారన్నారు. మనమందరం కూడా తోడ్పాటు అందించాలని వారు కోరారు. పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్‌, అసెంబ్లీ కన్వీనర్‌ మల్లేష్‌యాదవ్‌, జోగి రవి, రావుల భాస్కర్‌, బుచ్చిరెడ్డి, కొమురయ్య, సంతుగౌడ్‌, మాజీ డివిజన్‌ అధ్యక్షులు అడికే జనార్దన్‌, తలారి చిన్నా, శ్రీకాంత్‌రెడ్డి, అడికే మహేందర్‌, అడికే రాజు, డివిజన్‌ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి, అంజమ్మ, వినయ్‌రెడ్డి, మజర్‌, సి.హెచ్‌.ప్రభుదాస్‌, వెంకటరమణగుప్తా, ఎన్ను శంకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, గోపాల్‌నాయక్‌, ఎల్‌.వి.రెడ్డి, హనుమంత్‌రెడ్డి, కుర్మయ్య, షకీల్‌, సచిన్‌, ఎ.శివ, ఉత్తం, యాదగిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమతుల ఆహారంపై అవగాహన


మదన్‌పల్లిపాత తండాలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శంషాబాద్‌ రూరల్‌: ఆరోగ్యం కోసం సమతుల్య ఆహారం ముఖ్యమని జిమ్స్‌ కమ్యూనిటీ మెడిసిన్‌ విభాగం వైద్యురాలు ప్రొఫెసర్‌ పూనమ్‌ సుతార్‌ అన్నారు. జిమ్స్‌ హోమియోపతిక్‌ వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో పోషన్‌ మాహ్‌, స్వస్థ్‌ నారీ శసక్త్‌ పరివార్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మదన్‌పల్లి తండాలో మహిళల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కౌమార దశలోని బాలికలు, మహిళలతో పాటు ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఇందుకోసం తాజా కూరగాయాలు, పండ్లు తీసుకుంటే శరీరానికి పోషకాలు అందుతాయన్నారు. రక్తహీనత నివారణ, రోగనిరోధకశక్తి, పునరుత్పత్తి, జీవన నాణ్యతను బలోపేతం చేయడంలో పోషకాహార పాత్ర ఎంతో ఉంటుందన్నారు. పోస్టర్లు, ర్యాలీతో పాటు ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ మానస, కళాశాల విద్యార్థులు, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ జ్ఞానేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, ప్రగతి, వినోద, మంగ తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్షలు పలికిన ఫ్యాన్సీ నెంబర్లు

మణికొండ: వాహనాలకు వచ్చే నెంబర్లను ఫ్యాన్సీగా ఏర్పాటు చేసుకునేందుకు కొందరు ఎంత డబ్బు అయినా ఖర్చు చేస్తుంటారు. అందులో భాగంగానే మణికొండలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వాహనాల నెంబర్ల వేలంలో వందలాది మంది పాల్గొన్నారు. టీజీ 07ఏజీ 9999 నెంబర్‌ను ముప్పా ప్రాజెక్ట్స్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థ రూ. 7,17,788లకు దక్కించుకుంది. టీజీ07 ఏహెచ్‌ 0009 నెంబర్‌ను రూ. 4.25 లక్షలకు ఎం.శివశంకర్‌గౌడ్‌ సొంతం చేసుకున్నారు. టీజీ 08ఏహెచ్‌ 0001 నెంబర్‌ను నిక్‌ స్టుడియోస్‌ సంస్థ రూ. 3.70 లక్షలకు, టీజీ 07 ఏహెచ్‌ 0099 నెంబర్‌ను కె.భాను రూ. 3.68 లక్షలకు సొంతం చేసుకున్నారని ఆర్టీఏ అధికారులు తెలిపారు. బుధవారం జరిగిన వేలంలో రూ. 38.29 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నేత


కేటీఆర్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కొలను ప్రదీప్‌రెడ్డి

శంషాబాద్‌: శంషాబాద్‌కు చెందిన బీజేపీ సీనియర్‌ నాయకుడు కొలను ప్రదీప్‌రెడ్డి రాజేంద్రనగర్‌ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ ఇన్‌చార్జీ పి.కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌ చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. గతంలో బీఆర్‌ఎస్‌లో ఉన్న ప్రదీప్‌రెడ్డి పొలూష్యన్‌ బోర్డు మాజీ సభ్యుడిగా పనిచేసిన అనంతరం బీజేపీలో చేరారు. బీజేపీ విధానాలు నచ్చక ఆయన బీఆర్‌ఎస్‌ గూటికి తిరిగి చేరుకున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వ ఆరాచకపాలనకు బీజేపీ వంతపాడుతోందన్నారు. బీఆర్‌ఎస్‌ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. మాజీ ఎంపీపీ మురళీధర్‌ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సతీష్‌, పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌రావు, టీఆర్‌ఎస్‌వీ మాజీ నాయకులు మంచర్ల శ్రీనివాస్‌, సీనియర్‌ నాయకులు కొనమొల్ల శ్రీనివాస్‌, రాజేందర్‌, వెంకట్‌రెడ్డి, చరణ్‌, హన్మంతు ముదిరాజ్‌ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ఉన్న అడ్డంకులను అధిగమిస్తాం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని కలిసిన సాధన సమితి నాయకులు

మణికొండ: పశ్చిమ రంగారెడ్డి జిల్లా అభివృద్ధిని శాసిస్తున్న రోడ్డు అభివృద్ధికి ఉన్న అడ్డంకులను తొలగిస్తున్నామని, త్వరలోనే శుభవార్త వింటారని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గండిపేట మండలంలోని పోలీస్‌ అకాడమీ నుంచి వికారాబాద్‌ జిల్లా మన్నెగూడ వరకు ఉన్న రోడ్డును జాతీయ రహదారిగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. దానికి ఇరువైపులా ఉన్న మర్రిచెట్లను తొలగించవద్దని కొందరు జాతీయ గ్రీన్‌ ట్రిబ్యునల్‌(ఎన్‌జీటీ)లో కేసు వేసిన విషయం తెలిసిందే. దాంతో సంవత్సరాల తరబడి రోడ్డు విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దాన్ని సాధించేందుకు రోడ్డు విస్తరణ సాధన సమితిగా ఏర్పడి కొంత మంది పోరాటం చేస్తున్నారు. వారు బుధవారం మణికొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి రోడ్డు విస్తరించకపోవటంతో జరుగుతున్న ప్రమాదాలు, పోతున్న ప్రాణాలు, నిలిచిపోయిన అభివృద్ధిని వివరించారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే రోడ్డు విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, తనను ఆదేశించారన్నారు. అందుకు అనుగుణంగానే పలు మార్లు జాతీయ రహదారుల అధికారులతో చర్చలు జరిపామన్నారు. ఎన్‌జీటీలో ఉన్న కేసు అడ్డంకి తొలగితే తాము పనులను వెంటనే చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని వారు హామీ ఇచ్చారన్నారు.

త్వరలో శుభవార్త...

పోలీస్‌ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులకు ఎన్‌జీటీలో అడ్డంకిగా ఉన్న కేసును త్వరలోనే తొలగించుకు ప్రయత్నిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కేసు వేసిన వారితో ఇప్పటికే మాట్లాడామని, రోడ్డు విస్తరణ చేయకపోవటంతో ఇప్పటి వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలు, చనిపోయిన వారి వివరాలను చెప్పి వారిని ఒప్పించామన్నారు. రోడ్డు విస్తరణ జరగక పశ్చిమ రంగారెడ్డి జిల్లా విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో వెనకబడి ఉందని, హైదరాబాద్‌కు రావాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రావాల్సి వస్తుందని వివరించామన్నారు. దాంతో కేసు వేసిన వారు రాబోయే విచారణ తేదీ రోజు ఉపసంహరణ పిటిషన్‌ వేస్తామని హామీ ఇచ్చారన్నారు. రాబోయే పది రోజుల్లో అది జరుగుతుందని, నెల రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని సాధన సమితి వారికి హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణ సాధన సమితి కన్వీనర్‌ గోపాల్‌రెడ్డి, సభ్యులు సీపీ రెడ్డి, భీమ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, లక్ష్మణ్‌, వెంకటేశ్వర్‌రెడ్డి, యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి, జావేద్‌, ఆనంద్‌, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవం

మైలార్‌దేవ్‌పల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టిహారం తీసుకొని బలంగా, ఆరోగ్యవంతంగా ఉండాలని సూపర్‌వైజర్‌ పద్మజ సూచించారు. శేరిలింగంపల్లి ప్రాజెక్టు మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్‌ బాబుల్‌రెడ్డినగర్‌ అంగన్‌వాడీ–2 సెంటర్‌లో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్‌ అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ...బాలామృతం, గుడ్లు, పాలు, ఆకుకూరలు, మాంసం, చేపలు, పప్పు ధాన్యాలు ఇతర అధిక ప్రొటీన్స్‌ కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని అన్నారు. గర్భిణులు, బాలింతలు అధిక పోషక ఆహారాలు తీసుకోవాలని సూచించారు. రక్తహీనత లేకుండా వైద్యుల సలహా మేరకు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఐరన్‌ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేణుక, అంగన్‌వాడీ టీచర్లు అనిత, మాధవి, కనకవ్వ, రత్న, ప్రేమకుమారి, సరిత, మంగ, లక్ష్మి, మణెమ్మ, సునిత, రేణుక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రజలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న జాంద్ర సంఘం సభ్యులు

బండ్లగూడ: అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తానని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ జాంద్ర సంఘం సభ్యులు బుధవారం కార్పొరేషన్‌ డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డితో కలిసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ నెల 27వ తేదీన జరిగే జాంద్ర సంఘం పరిచయ వేదిక, బతుకమ్మ పూజలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. తప్పకుండా హాజరవుతానని ఆయన హామీ ఇచ్చారు. జాంద్ర సంఘం బండ్లగూడ జాగీరు కమిటీ అతితీకాలంలోనే అపూర్వ ఆదరణకు నోచుకోవడంపై సంఘం సలహాదారులు, సంఘం సభ్యులందరూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు ఆవుల రవికుమార్‌, కమిటీ సలహాదారులు, కోర్‌ బాడీ సభ్యులు, ఎగ్జిక్యూటివ్‌ బాడీ సభ్యులు సమష్టిగా సభ్యుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలి


స్వీపింగ్‌ పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య పనులు నిర్వర్తించే కార్మికులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తూనే అప్రమత్తంగా ఉండాలని బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర సూచించారు. బుధవారం కార్పొరేషన్‌ పరిధిలోని పలు ప్రాంతాల్లో స్వీపింగ్‌ పనులను ఆయన పరిశీలించారు. 12వ డివిజన్‌లోని హిమాయత్‌సాగర్‌, 20వ డివిజన్‌లోని కాళీమందిర్‌ జంక్షన్‌, 15వ డివిజన్‌లోని సన్‌సిటీ ప్రధాన రహదారులపై స్వీపింగ్‌ పనులను పర్యవేక్షించారు. రహదారిపై స్వీపింగ్‌ చేస్తున్న సమయంలో వేగంగా వచ్చే వాహనాలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జి.వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు మీర్జా టౌఫిక్‌, నరేందర్‌, రాము, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణగా అమ్మవారు

- వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- భక్త జన సంద్రాలైన అమ్మవారి ఆలయాలు

మణికొండ: దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం మూడవ రోజు అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. రాజేంద్రనగర్‌ నియోజకవర్గ వ్యాప్తంగా దేవాలయాలు, కాలనీలు, గేటెడ్‌ కమ్యూనిటీలలో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమలతో పాటు దుర్గామాత దేవాలయాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండపాల వద్ద బతుకమ్మ, దాండియాతో సందడి చేశారు.

సమతాస్ఫూర్తి కేంద్రంలో ధనలక్ష్మిగా...

శంషాబాద్‌ రూరల్‌: శంషాబాద్‌ మండల పరిధిలోని ముచ్చింతల్‌ శివారులో ఉన్న సమతాస్ఫూర్తి కేంద్రంలో శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు ధనలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీ అహోబిల జీయర్‌స్వామి సమక్షంలో అష్టోత్తర నామార్చణ, కుంకుమార్చణ, అమ్మవారి అభిషేకం తదితర పూజలు నిర్వహించారు.


సమతాస్ఫూర్తి కేంద్రంలో పూజలు నిర్వహిస్తున్న అహోబిల జీయర్‌స్వామి


అన్నపూర్ణ దేవిగా దర్శనం ఇస్తున్న మణికొండ ఓయూ కాలనీలోని దుర్గామాత


మణికొండ సగర సంఘం మహిళల బతుకమ్మ సంబరాలు


ధర్మగిరిలో అన్నపూర్ణేశ్వరిగా అమ్మవారు